## మూడు పాత్రలు



'అతను' 'ఆమె'ను ప్రేమిస్తున్నాడు.
'ఆమె' 'అతణ్ని' ప్రేమిస్తున్నది.
అయినా, ఈ ప్రేమ సుఖాంతం కాదు.
ఎందుకంటే,
ఈ కథలో మూడు పాత్రలున్నాయి..
అతను, ఆమె, ఆమె!

## బ్రెయిన్ డెడ్



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. లవ్ ఫెయిల్యూర్.
సూసైడ్ అటెమ్ట్. బ్రెయిన్ డెడ్.
ఇంకా పనిచేస్తున్న గుండెను
అంబులెన్స్‌లో
అపోలోకు తరలిస్తున్నారు.
మధ్యలో ట్రాఫిక్ జామ్.
ఎవరిదో శవయాత్ర.
హఠాత్తుగా
ఆ గుండె ఆగిపోయింది.
పాడె మీద అతడి ప్రేయసి.

## ముక్కలు ముక్కలు



ఆ శాడిస్టు ప్రేమికుడు
ఆమెను
ఇరవై ఎనిమిది
ముక్కలుగా నరికేశాడు.
'ఇరవై తొమ్మిది ముక్కలు
చేయాల్సింది డియర్.
మరిచిపోయావా?
మనం కలుసుకున్నది
ఫిబ్రవరి 29న..
లీపు సంవత్సరం'
ప్రేయసి గుండె
ఘోషిస్తూనే ఉంది.

## లేత గులాబీ



నాన్న ఇచ్చిన డైమండ్ నెక్లెస్,
అన్నయ్య కొన్న ఆపిల్ ఫోన్,
బాబాయ్ పంపిన మేకప్ కిట్..
ఆ ఖరీదైన పుట్టినరోజు
బహుమతుల మధ్య
ఇరుక్కుపోయిన
ఓ లేత రోజాను
ఆమె జాగ్రత్తగా
బయటికి తీసింది.
అది.. 'ప్రేమ' గులాబీ!

## వీడ్కోలు



రైల్వేస్టేషన్‌కు వచ్చి..
ట్రెయిన్ ఎక్కించి..
బండి కదిలే వరకు
కిటికీ పక్కన నిలబడి..
పచ్చలైటు పడగానే
హ్యాపీజర్నీ చెప్పి..
దిగాలుగా కంటతడి
పెట్టేంత వరకూ
తెలియదు..
నేనంటే అంత ప్రేమని!